క్లుప్తంగా

నేడు యార్లగడ్డలో 'గడప గడపకు'

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 2గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ ఇన్‌చార్జిలు హాజరు కావాలని వారు కోరారు.

ఎంపీడీవోగా సీతయ్య బాధ్యతల స్వీకరణ నేడు

కొయ్యూరు: అనంతగిరి ఈవోపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న లాలం సీతయ్య కొయ్యూరు ఎంపీడీవోగా సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన మాట్లాడుతూ అనంతగిరిలో ఉదయం రిలీవ్ అయిన వెంటనే కొయ్యూరు వచ్చి బాధ్యతలు చేపడతామన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

రాజవొమ్మంగి: వేసవి సెలవులు ముగిసిన నేపథ్యంలో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభించనున్నట్టు, ఇందులో భాగంగా కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఒంటిపూట బడులను కొనసాగించనున్నట్టు ఎంఈవో తాతబ్బాయిదొర తెలిపారు. పాఠశాలలో ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఇందులో ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్య పిల్లలకు రాగి జావ పంపిణీ, 11.30 నుంచి 12 గంటల మధ్య మధ్యాహ్న భోజనం అందజేయనున్నట్టు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలకు సరఫరా చేసేందుకు దగ్గరలోని జీసీసీ చౌకడిపోల్లో రాగి జావ పిండి, బెల్లం సిద్ధం ఉన్నట్టు స్థానిక ఎంఈవో తాతబ్బాయిదొర తెలిపారు. సంబంధిత హెచ్‌ఎంలు పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ఆయా సామగ్రి తీసుకెళ్లి, మెనూ ప్రకారం విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు.

ప్రమీలమ్మకు ఆర్థిక సాయం

అరుకులోయరూరల్: మండలంలోని ఇరగాయి పంచాయతీ బోందుగుడ గ్రామానికి చెందిన జన్ని ప్రమీలమ్మ(10) అనే గిరిజన బాలిక వింత చర్మవ్యాధితో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న విశాఖపట్నం తపాలశాఖలో పనిచేస్తున్న లోతేరు గ్రామానికి చెందిన కొర్రా వెంకట్ ఆదివారం బోందుగుడ గ్రామానికి చేరుకుని, బాలిక వైద్యం కోసం రూ.3వేల ఆర్థిక సాయం చేశారు. అదే పంచాయతీలో వీఆర్వోగా పనిచేస్తున్న పాంగి చిట్టిబాబు రూ.2వేలు అందజేశారు.

ఎంపీడీవోగా యాదగిరీశ్వరరావు



రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఎంపీడీఓగా ఎల్.యాదగిరీశ్వరరావు నియమితులయ్యారు. ఆయన బుధవారం విధుల్లో చేరనున్నారు. నర్సీపట్నం ఈఓపీఆర్డీగా చేస్తున్న యాదగిరీశ్వరరావు పదోన్నతిపై ఇక్కడకు వస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన బాపన్నదొర అడ్డతీగలకు బదిలీ అయ్యారు.

బ్రాండిక్స్‌లో 290 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్‌లో ఆదివారం 290 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 108వ కంటి వైద్య శిబిరాన్ని విశాఖ శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించారు. 208 మందికి ఉచితంగా కళ్లద్దాలు, 54 మందికి మందులు పంపిణీ చేశారు. 24 మందిని కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. బ్రాండిక్స్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 10 మంది రక్తదానం చేశారు.

వస్త్ర సంచులు పంపిణీ

రోలుగుంట: వస్త్ర సంచులను వినియోగించి పర్యావరణాన్ని రక్షించాలని వృక్షమిత్ర వ్యవస్థాపకుడు అప్పన రాంబాబు మాస్టారు కోరారు. వస్త్ర సంచుల మేలుపై కుసుర్లపూడిలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలుగుతున్న నష్టాలతో వాటిని పూర్తిగా నిషేధించిందన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

- దుక్కుల పనుల్లో నిమగ్నం
- వేసవి పంటగా వేరుశనగపై ఆసక్తి



పెదబయలులో సాగులో ఉన్న వేరుశనగ పంట



పసుపు దుంపలను నాటుతున్న రైతులు

పెదబయలు: గిరిజన ప్రాంత రైతులు సంప్రదాయ పంటలు పసుపు, పిప్పళ్ల పంటలు పండిస్తూనే ఖరీఫ్ వరి సాగుపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. అలాగే వాణిజ్య పంటలపై మండలంలోని సీతగుంట, అరడకోట, అడుగులుపుట్టు, గలగండ, గంపరాయి, ముంచంగిపుట్టు మండలం దారెల, పెదగుడ, ఏనుగురాయి, మాకవరం, దోడిపుట్టు పంచాయతీల్లో ఎక్కువగా వాణిజ్య పంటలు వేరుశనగలు ఎక్కువగా సాగుచేస్తున్నారు. మన్యంలో పండించే వేరుశనగలకు మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో రైతులు గత రెండేళ్ల నుంచి ఎక్కువగా సాగు చేస్తున్నారు.మండలంలోని సీతగుంట, అడుగులపుట్టు పంచాయతీల్లో వందల ఎకరాల్లో మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఈ ఏడాది మరింతగా సాగు విస్తరించారు.

జోరందుకున్న వ్యవసాయ పనులు

మండలంలోని ఖరీఫ్ వరి, సామలు, రాగుల పంటలకు సంబంధించి రైతులు వేసవి దుక్కులు దున్నుతున్నారు. మెట్ట పంటలు సామలు, రాగులు, కొర్రలు, ఇతర పంటలకు సంబంధించి పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ వరి కోసం దుక్కులు దున్నుతున్నారు. అలాగే ఇటీవల ప్రభుత్వం సబ్సిడీ పసుపు విత్తనాలు అందించడంతో రైతులు నాటుతున్నారు. వేసవి దుక్కుల వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని, కలుపు నివారణలో వర్షం పడితే నీటిని ఎక్కువ పీల్చుకుంటుందని, సేంద్రీయ ఎరువులు వేసిన ఎక్కువగా భూమిలో కలుస్తుందని వేసిన పంట బాగా దిగుబడి వస్తుందని రైతులు వాపోతున్నారు.

పంట బాగుంది

ఈ ఏడాది వేరుశనగల పంట దిగుబడి బాగుంది. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో గత ఏడాది కంటే ఎక్కువగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మరో రెండు నెలల్లో పంట తీరడం జరుగుతుంది. గత ఏడాది ధర బాగానే ఉంది. ఈ ఏడాది ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది మే నెలలో వర్షాలు పడుతుండడంతో సాగుకు అనుకూలంగా ఉంది.

– టి.శోభన్‌బాబు, రైతు, సీతగుంట గ్రామం

వేరుశనగ విత్తనాలు పంపిణీ



గత ఏడాది చింతపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి లేపాక్షి రకం వేరుశనగ విత్తనాలు గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా మండలంలోని సీతగుంట పంచాయతీలో రోగులపేట, చిత్రాయిపుట్టు రైతులకు అందించాం. గత ఏడాది సీతగుంట పంచాయతీలో సుమారు 650 హెక్టార్లలో వేరుశెనగ సాగు చేశారు. దీంతో పాటుగా అడుగులపుట్టు, సీకరి, అరడకోట, గలగండ, గంపరాయి,పెదకోడాపల్లి పంచాయతీల్లో కూడా సాగు చేస్తున్నారు. 90 రోజుల వేసవి పంటకు మంచి దిగుబడి వస్తుంది. ఎక్కువగా నీరు అందుబాటులో ఉన్న ఇసుక నేలల్లో సాగుకు అనుకూలంగా ఉంది. గత ఏడాది కంటే ప్రస్తుతం సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

– ఏ.శ్రీనివాస్, వ్యవసాయ అధికారి, పెదబయలు మండలం

మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం



జగనన్న విద్యా కానుక కిట్లను ఉపాధ్యాయులకు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయరూరల్: మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను ఆయన ఆదివారం పరిశీలించారు. విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక కిట్‌లో యూనిఫాం, బ్యాగులు, నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. అనంతరం మండలంలోని 150 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కిట్లను అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. విద్యార్థులకు అందించే వస్తువుల్లో నాణ్యతలో రాజీలేకుండా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిరుపేదలకు నాణ్యమైన విద్యను అందించే దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చొరవను కొనియాడారు. ఎంఈవో భారతిరత్నం, సీఆర్పీలు రమేష్, మాణిక్యమ్మ, వాసు, మండల కన్వీనర్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శరవేగంగా రహదారి నిర్మాణ పనులు



ముంచంగిపుట్టు-పెదబయలు మార్గంలో విస్తరణ పనులు జరుగుతున్న దృశ్యం

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన మార్గంలో కుజభంగి జంక్షన్ నుంచి చిత్రాయిపుట్టు గ్రామం వరకు రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. గతంలో రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతూ వచ్చాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీనికిపై అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో మాట్లాడి పనులు మళ్లీ మొదలు పెట్టించారు. దీంతో గత రెండు నెలలుగా రహదారి విస్తరణ పనులు సుమారు రూ.2కోట్లతో శరవేగంగా జరుగుతున్నాయి. రహదారి విస్తరణ పూర్తయితే ముంచంగిపుట్టు నుంచి పెదబయలు మండలాల వందలాది వాహన రాకపోకలకు ఇరుకైన రహదారి సమస్య తీరుతుందని వాహనచోదకులు చెబుతున్నారు. ప్రస్తుతం రహదారి విస్తరణలో భాగంగా రహదారిపై మెటల్ వేసి రోలింగ్ పనులు పూర్తికాగా, తారు వేసినట్టు అర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యం



ఏనుగురాయిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నరసింగరావు

ముంచంగిపుట్టు: ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏనుగురాయి పంచాయితీ సర్పంచ్ ఎస్.నరసింగరావు అన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కేంద్రంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా మంజూరైన రూ.10లక్షల నిధులతో చేపట్టనున్న 250 మీటర్ల సీసీ రోడ్డు పనులకు ఆదివారం సర్పంచ్ నరసింగరావు, వైఎస్సార్‌సీపీ నేతలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరసింగరావు మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు మహర్దశ నెలకొందని ప్రతి గ్రామానికి రహదారి, సీసీ రోడ్డు సౌకర్యం కల్పించి రవాణా వ్యవస్థ మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం గిరిజన అభ్యున్నతి కోసం విశేష కృషి చేస్తోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకుడు మూర్తి, వార్డు సభ్యుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం ప్రారంభం



తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

హుకుంపేట: మండలంలోని చీకుమద్దుల పంచాయతీ బొడ్డాపాడు గ్రామంలో పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన తాగునీటి ట్యాంకు, వీధి కుళాయిలను ట్రస్టు డైరెక్టర్ చాగంటి సూర్యారావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టు డైరెక్టర్ సూర్యారావు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సంస్థ తరపున రూ.1.50లక్షల వ్యయంతో మంచినీటి ట్యాంకు, కుళాయి కనెక్షన్ ఏర్పాటుచేశామన్నారు. తాగునీటి సమస్య ఉన్న గిరిజన గ్రామాలను గుర్తించి, మంచినీటి ట్యాంకులు నిర్మిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉత్రన్న, వైస్ సర్పంచ్ జి.కామేశ్వరరావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న గిరిజన సంఘం నేత సురేంద్ర తదితరులు

డుంబ్రిగూడ: పేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. మండల కేంద్రంలోని శారద నికేతన్ ప్రైవేట్ పాఠశాలలో యూనిటీ ఫర్ చారిటీ ట్రస్టు సహాయంతో 40 మంది అనాథ, దివ్యాంగ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, యూనిఫాంలు, బూట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద, అనాథ, దివ్యాంగ విద్యార్థులకు ఫీజులు చెల్లించడంతో పాటు వారికి కావల్సిన బూట్లు, పాఠ్యపుస్తకాలు, ఇతరత్రా సామగ్రిని సంస్థ అందజేయడం హర్షణీయమన్నారు. ట్రస్ట్ సేవలను అభినందించారు. మయూరి సిల్క్ అధినేత రాజారావు, ట్రస్ట్ ప్రతినిధులు జోస్పిన్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సంత ఆశీలు వసూలుకు వేలం నేడు

అడ్డతీగల: అడ్డతీగల సంత మార్కెట్ ఆశీలు వసూలు చేసుకోవడానికి బహిరంగ వేలంపాటను సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు గ్రామ పంచాయితీ కార్యదర్శి అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హులైన వారు స్థానిక గ్రామ సచివాలయం-1 వద్ద నిర్వహించనున్న బహిరంగ వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు. సర్పంచ్ ఆధ్వర్యంలో విస్తరణాధికారి అడ్డతీగల అధ్యక్షతన వేలంపాట నిర్వహిస్తామన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

- ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు
- పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు



డుంబ్రిగుడలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచ్ వెంకటరావు, లైబ్రేరియన్ సునీత తదితరులు



హుకుంపేటలో విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తున్న సిబ్బంది



చింతపల్లిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య

డుంబ్రిగుడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రంథాలయాల్లో నెల రోజులకు పైగా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, పాటలు, ఆటల పోటీలు నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు. వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. శిబిరాలకు అనూహ్య స్పందన వచ్చినట్టు లైబ్రేరియన్లు తెలిపారు. వేసవి శిబిరాల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పలువురు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలుగా అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి వచ్చి అక్కడ అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

➡ డుంబ్రిగుడ శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరావు, డుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు గీత,



కూనవరంలో విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న సర్పంచ్ హేమంత్ తదితరులు

స్వామి, ఉపాధ్యాయులు బాబూరావు, సింహాద్రి, శాఖా గ్రంథాలయాధికారి శెట్టి సునీత తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను శాఖా గ్రంథాలయాధికారి వి.మానన, గిరిజన సంఘం నాయకుడు టి.కృష్ణారావు తదితరులు అందజేశారు.

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కొరాబు అనూషదేవి మాట్లాడుతూ గ్రంథాలయానికి వచ్చిన పుస్తక పఠనం చేయడం వలన పరిజ్ఞానం మరింత మెరుగుపడుతుందన్నారు. విలువైన సమాచారం ఉన్న పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరాల్లో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంఈవో ప్రసాద్, లోతుగడ్డ, తమ్మంగుల సర్పంచులు చింతర్ల సునీల్, లక్ష్మయ్య ,కో-ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం భద్రం, గ్రంథాలయాధికారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: స్థానిక గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను సర్పంచ్ మల్లంపల్లి హేమంత్, డాక్టర్ వెంకయ్య, మేరుకులం రాష్ట్ర డైరెక్టర్ దీకొండ గంగాధర్, రిటైర్ టీచర్ ఎస్.వెంకటస్వామి తదితరులు అందజేశారు. లైబ్రేరియన్ గోవిందరాజులు, ఎస్.సత్యనారాయణ, సిబ్బంది నాగరాజు, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాలాజీబాబు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న వివిధ పుస్తకాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులు రోజూ గ్రంథాలయాలకు వెళ్లడం అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, లైబ్రేరియన్ రమేష్, వార్డు మెంబర్ దేవి, పాల్ బుజ్జీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కలుముల అక్కమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని అభివర్ణించారు. విద్యార్థులు తరచూ గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వేసవి విజ్ఞాన శిబిరాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. శాఖ గ్రంథాలయాధికారి గంగాభవానీ, పాఠకులు వెంకటలక్ష్మి, వీర్రాజు, లావణ్యదేవి తదితరులు పాల్గొన్నారు.



గంగవరం గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ అక్కమ్మ

కనులపండువగా అమ్మవార్ల ఉత్సవాలు



సత్తెమ్మతల్లి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



మోదమాంబ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

మునగపాక: మునగపాక దళితవాడలో ఆదివారం సత్తెమ్మతల్లి పండుగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. కాలనీవాసులంతా ఘటాలతో డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ జయలక్ష్మి,జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు,మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము,బోడకుర్తి గణేష్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా అమ్మవారి ఒడ్డు పండగలు

మాడుగుల రూరల్: గ్రామాల్లో అమ్మవార్ల ఒడ్డు పండగలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాగరంలో మోదమాంబ అమ్మవారికి గుమ్మాల కొండలరావు కుటుంబ సభ్యులు ఒడ్డు పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఎంపీటీసీ శ్రీనాథు సూర్యకాంతం, జగ్గారావు, నాయకులు పాము వెంకట్రావు, దేముళ్లు పాల్గొన్నారు. కె.జె.పురంలో మోదమాంబ ఆటో వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఘటాల ఊరేగింపుతో మోదమాంబ పండగ నిర్వహించారు.


రావికమతం: కొత్తకోటలో మోదకొండమ్మ, రావికమతంలో సత్తెమ్మతల్లి పండగలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. పలువురు మహిళలు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ శానాపతి అప్పారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



ఉత్సవానికి వచ్చిన గ్రామస్తులు

రాధాకృష్ణ ఆలయ వార్షికోత్సవం నేడు

కొత్తకోటలోని రాధాకృష్ణ ఆలయ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఆలయం వద్ద ఉదయం హోమాలు, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



ఘటాల ఊరేగింపులో భక్తులు

పోతురాజుబాబు పండగ రేపు



ఉమ్మలాడలోని పోతురాజుబాబు

మునగపాక: ఉమ్మలాడలో ఈ నెల 13న పోతురాజుబాబు పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, అదే రోజు రాత్రి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పోతురాజు బాబును దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

ఘనంగా అభయాంజనేయుని ఆలయ ప్రతిష్ట

కోటకోట : స్థానిక ద్వారపురెడ్డివారి వీధిలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా స్వామివారి విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఊరేగించారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ శ్రీరామాచార్యులు, యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మారుతి సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం స్వామి ఆలయ ప్రతిష్టాపన, మధ్యాహ్నం అన్న సమారాధన జరపనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

25న యోగా పోటీలు

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉదయం 7 గంటలకు యోగాసనాల పోటీలు నిర్వహించనున్నట్టు సెంటర్ ప్రతినిధి సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.